విద్యుత్‌ సమస్యలపై తక్షణమే స్పందించాలి



విద్యుత్‌ సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: విద్యుత్‌ సమస్యలు, వీధీ దీపాల సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీలో పర్యటించిన ఆయన కొండాపూర్‌, మాధవరెడ్డి వంతెన, కరీంగూడ రోడ్డు, ఈడబ్ల్యూఎస్‌ కాలనీలో విద్యుత్‌ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో విద్యుత్‌ దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామన్న స్థానికుల విన్నపం మేరకు పలు చోట్ల మరమ్మతులు చేయించి హైమాక్స్‌ లైట్లు, ఇతర లైట్లు బిగించారు. ప్రజల విద్యుత్‌ సమస్యలపై తక్షణమే స్పందించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

రోడ్డుకు మరమ్మతులు చేసిన కౌన్సిలర్‌



గుంతలను పూడుస్తున్న కౌన్సిలర్‌ హరికృష్ణయాదవ్‌

మేడ్చల్‌: రోడ్డు గుంతల మయం అయ్యిందని తగు రిపేర్లు చేయాలని కౌన్సిలర్‌ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా స్పందన లేక పోవడంతో ఆ వార్డు కౌన్సిలరే శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. మేడ్చల్‌ పట్టణంలోని 15వ వార్డులో ప్రధాన రోడ్డులో మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ లీకేజీ వల్ల గుంతలు ఏర్పడ్డాయి. దీనిని పరిష్కరించాలని కౌన్సిలర్‌ హరికృష్ణయాదవ్‌ పలుమార్లు మున్సిపల్‌ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో పలుగుపార చేత బట్టి గుంతలలో మట్టి పోసి పూడ్చారు. సిమెంట్‌ ఇటుకలు తీసుకువచ్చి గుంతలలో వేసి తగు మరమ్మతులు చేశారు. సమస్యను తాత్కలికంగా తీర్చినా శాశ్వత పరిష్కారం అధికారులు చూపాలని కోరుతున్నారు.


క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి



క్రీడాకారులను అభినందిస్తున్న చైర్మన్‌ గౌతంరావు

ఘట్‌కేసర్‌: క్రీడలతో క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని విజ్ఞాన భారతి ఇంజనీరింగ్‌ కళాశాల (వీబీఐటీ) కార్యదర్శి డాక్టర్‌ మనోహర్‌రెడ్డి అన్నారు. విజేతలైన వీబీఐటీ వాలీబాల్‌ క్రీడాకారులను బుధవారం ఆయన అభినందించారు. తేజాస్‌–2024 వర్ధమాన్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో గత నెలలో జరిగిన స్టేట్‌ లెవల్‌ వాలీబాల్‌ టోర్నీలో వీబీఐటీ పురుషుల వాలీబాల్‌ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడల దుస్తులు, ప్రశంసా పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ధృడంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీలిమ, హెచ్‌ఓడీ రామకృష్ణ, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పీడీలు వెంకట్‌, మహేష్‌, పాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రీయ పద్ధతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



భూసార పరీక్ష పత్రాలను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్‌ నర్సింహులు యాదవ్‌ తదితరులు

శామీర్‌పేట్‌: రైతులు శాస్త్రీయ పద్ధతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నర్సింహులు యాదవ్‌ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామంలో ఇక్రిశాట్‌ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూసారానికి అనుగుణంగా పంటలను సాగు చేయాలని, అధికారుల సూచనల మేరకు వ్యవసాయం చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం కేశవరం, నాగిశెట్టిపల్లి, జగ్గంగూడ గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించి పత్రాల రూపంలో రైతులకు ఇక్రిశాట్‌ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో కేశవరం మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, ఇక్రిశాట్‌ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న ఆలయంలో అన్నదానం

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ మాజీ మేయర్‌ మేకల కావ్య పుట్టినరోజు సందర్భంగా బుధవారం శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు మేకల అయ్యప్ప, భార్గవ్‌రామ్‌, అధ్యక్షులు కొండల్‌ ముదిరాజ్‌, అహ్మద్‌పాషా, ప్రసాద్‌గౌడ్‌, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో ఉద్యోగ అవకాశాల్లో భాగంగా స్టెనో/టైపిస్ట్‌ (01), రికార్డు అసిస్టెంట్‌ (01) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

- స్టెనో/టైపిస్ట్‌ పోస్టుకు డిగ్రీ అర్హతతో పాటు షార్ట్‌ హ్యాండ్‌ (హయ్యర్‌) నిమిషానికి 120 పదాల స్పీడ్‌ ఉండాలని, ఇంగ్లీష్‌ (హయ్యర్‌)నిమిషానికి 45 పదాల టైప్‌ వచ్చి ఉండాలన్నారు. రికార్డు అసిస్టెంట్‌ పోస్టుకు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నోటిఫికేషన్‌ జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న సాయంత్రం 5 గంటల లోపు రిజిస్టర్‌ పోస్ట్‌/స్పీడ్‌ పోస్ట్‌ ద్వారా చైర్మన్‌, డిస్ట్రిక్ట్‌ లీగల్‌ సర్వీస్‌ అథారిటీ, మేడ్చల్‌–మల్కాజిగిరి డిస్ట్రిక్ట్‌ కోర్ట్‌ కాంప్లెక్స్‌ అడ్రస్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మేడ్చల్‌ సమస్యలు.. తీరేదెన్నడో?

- ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టింపు కరువు
- ట్రాఫిక్‌, క్రీడా స్థలం, సరుకుల కొనుగోలు సమస్యలు

“ డెబ్బై రెండు ఏళ్లుగా నియోజకవర్గ కేంద్రం, 8 ఏళ్ళుగా జిల్లా కేంద్రం.. ఎన్నో ఏళ్లు మండల కేంద్రం, నాడు తాలుకా కేంద్రం.. నేడు మున్సిపల్‌ కేంద్రం ఇలా ఎన్నో పాలనలకు కేంద్రంగా ఉన్న మేడ్చల్‌ నేడు సమస్యలకు కేంద్రంగా ఉంది. లక్ష వరకు జనాభ నివసించే మేడ్చల్‌లో కనీస వసతులు లేక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మేడ్చల్‌ పట్టణంలో ప్రధానంగా మార్కెట్‌ సమస్య, రవాణ సమస్య, క్రీడాకారులకు స్టేడియం సమస్య, రోడ్ల సమస్య, ప్రతీ అంశంలో మేడ్చల్‌ వాసులు సమస్యలతో జీవిస్తున్నారు. –మేడ్చల్‌

మేడ్చల్‌ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మంత్రులుగా పని చేసి వారి నిరుద్యోగం తీర్చుకున్నారే గాని మేడ్చల్‌ అభివృద్ధి పై ఆశించినస్థాయిలో పని చేయలేదు. మేడ్చల్‌ ఎమ్మెల్యేగా పని చేసి సీఎం మర్రి చెన్నారెడ్డి హయాంలో అభివృద్ధి జరిగినా, మిగతా వారి సమయాల్లో అంతగా అభివృద్ధి జరగలేదు. కొందరు పని చేసినా మిగతా వారు పట్టించుకోకపోవడంతో మేడ్చల్‌ పేరు మాత్రమే గొప్పగా నిలిచింది.

మార్కెట్‌ సమస్య..

మేడ్చల్‌ పట్టణంలో ప్రధానంగా మార్కెట్‌ సమస్య ఉంది. అంబేద్కర్‌ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్‌ రోడ్డు వరకు, వివేకానంద విగ్రహం నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు మార్కెట్‌ ఉన్నప్పటికీ వ్యాపారాలు దుకాణాల్లో కంటే రోడ్ల పైనే ఎక్కువగా సాగుతున్నాయి. మార్కెట్‌ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఏది కొనాలన్నా తిరగాల్సి వస్తోంది. పూలు, పండ్లు, కూరగాయాలు, ఇతర సరుకులు రోడ్లపైన, వారంతపు సంతలపై ఆధారపడాల్సి వస్తోంది. మార్కెట్‌ రోడ్లపై ఉండటంతో నిత్యం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్లపై వ్యాపారాలు తొలగించి అన్నీ ఒకే చోట లభ్యమయ్యే విధంగా రైతు బజారు నిర్మించినా అది నిరుపయోగంగా మారింది. అది కేవలం వాహనాల పార్కింగ్‌ కేంద్రంగా మారింది. ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ల నిర్మాణం కేవలం శంకుస్థాపనలకే పరిమితమైంది.

అసంపూర్తి బ్రిడ్జితో నిత్యం అవస్థలే..

మేడ్చల్‌ పట్టణంలోని రైల్వే కట్ట అవతలి నుంచి ఇవతలికి వెళ్లాలన్నా, అక్కడి నుంచి అక్కడికి వెళ్ళాలన్న వాహనదారులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. 10 ఏళ్ల క్రితం గిర్మాపూర్‌ రోడ్డులో రైల్వే గేటును తొలగించి అండర్‌ పాస్‌ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినా అది నిర్మాణ దశలోనే ఉంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో కాలనీలకు, మండలంలోని గ్రామాలకు వెళ్లాలంటే 10 కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణం ఏళ్లుగా సాగుతుండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

ఆటస్థలం కరువు..

లక్షల రూపాయలు వెచ్చించి మేడ్చల్‌ చెక్‌పోస్ట్‌ వద్ద మినీస్టేడియం 20 ఏళ్లపాటు నిర్మించినా అది నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ హయాంలో ఆదరాబాదరగా ప్రారంభించినా అది ఆరంభ శూరత్వంగానే మారింది. పట్టించుకునే వారు లేక అది నిరుపయోగంగా మారింది. తెలంగాణ గ్రామీణ క్రీడా స్థలాలు గతంలో ఏర్పాటు చేసినా వాటి జాడ కనిపించడం లేదు.



కాలనీ వాసులను ఇబ్బందులు పెడుతున్న అసంపూర్తి రైల్వే బ్రిడ్జి

శివారు కాలనీల్లో రోడ్ల సమస్య..

పట్టణంలోని ప్రధాన కాలనీలలో రోడ్ల పరిస్థితి మెరుగ్గానే ఉన్నా శివారు కాలనీలు, నూతనంగా ఏర్పడ్డ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రోడ్లు నిర్మాణం చేయకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విలీన గ్రామాలు అత్వెల్లి, కిష్టాపూర్‌, గిర్మాపూర్‌, పూడూర్‌, రాయిలాపూర్‌ల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కనబడని పార్కులు..

పట్టణంలో లక్ష జనాభా వరకు ఉన్నా ప్రజలు సేద తీరడానికి ఒక పార్కు లేకుండా పోయింది. కాలనీల్లో అక్కడక్కడా చిన్న పార్కులు మినహ పట్టణ వాసులు సేద తీరి, కాసేపు నడక సాగించడానికి ఎక్కడా స్థలం లేకుండా పోయింది. కాలనీలలో పార్క్‌ స్థలాల్లో కమ్యూనిటీ హల్‌, వినాయక మండలపాలు శాశ్వతంగా నిర్మాణాలు జరగడంతో పార్క్‌ల జాడ లేకుండాపోయింది. గ్రంధాలయం వద్ద ఉండే ఏకైక పార్క్‌ జిల్లా గ్రంధాలయ నిర్మాణంలో మామమైపోయింది. ఇలా మేడ్చల్‌ పేరుకే గొప్పగా ఉన్నా, ప్రజలు నిత్యం సమస్యలతో పోరాటం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న మేడ్చల్‌కు పాలకులు ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆటకు పనికి రాని ఆటస్థలం

కలుషితమవుతున్న చెరువులు..

మేడ్చల్‌ పట్టణంలో పెద్ద చెరువు, తుమ్మ చెరువులు, ప్రధాన చెరువులు వీటితో పాటు గౌడవెల్లికి వెళ్లే దారిలో కుంట ఉండగా అన్ని చెరువులు కలుషితమవుతున్నాయి. కుంటల్లో, చెరువుల్లో మురుగు నీరు కలుస్తుండటంతో చెరువులు పూర్తిగా కలుషిమవుతున్నాయి. తుమ్మ చెరువు, గౌడవెల్లికి వెళ్లే దారిలో ఉన్న కుంట ఇప్పటికే పూర్తిగా మురుగుమయమైంది. ఇష్టానుసారంగా చెత్త వేయడం, కాలనీల మురుగు నీరు వదులుతుండటంతో ఆ రెండు కుంటలు దీనావస్థలో ఉన్నాయి. పెద్ద చెరువు సైతం కలుషితం వైపు అడుగులేస్తోంది.



కలుషితమైన తుమ్మ చెరువు



పార్కింగ్‌కు అడ్డాగా మారిన రైతు బజారు

ప్రత్యామ్నాయ మార్గాలు కరువు..

మేడ్చల్‌ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు, ఫ్లైఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణ పనులు సాగుతుండటంతో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే నిత్యం నరకం చూడాల్సి వస్తోంది. పట్టణ ప్రజలు రెండు కిలో మీటర్ల ప్రయాణంకు గంటల తరబడి ట్రాఫిక్‌ ఇరుక్కోవాల్సి వస్తోంది. వివేకానంద విగ్రహం నుంచి కట్టమీదుగా చెక్‌పోస్ట్‌ వరకు పాత జాతీయ రహదారి ఉండగా, దానిని ప్రత్యామ్నయ రోడ్డుగా మార్చాలని ఎంత మంది మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో జాతీయ రహదారిపై నిత్యం పట్టణం పొడవునా ట్రాఫిక్‌ జామ్‌ అవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాత రోడ్డు మీద వెళదామంటే చెరువు కట్ట పూర్తిగా గుంతలమయంగా మారింది.



గుంతలమయంగా మారిన పెద్ద చెరువు కట్ట, (పాత 44వ జాతీయ రహదారి)

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్‌: విద్యుత్‌ లైన్‌ల మరమ్మతుల కారణంగా అంకుషాపూర్‌ 33/11కేవీ సబ్‌స్టేషన్‌ ఘట్‌కేసర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఘట్‌కేసర్‌ టౌన్‌, సాయినగర్‌ కాలనీ, టీచర్స్‌ కాలనీ, మున్సిపల్‌ కార్యాలయం, అంబేద్కర్‌ నగర్‌, ఘట్‌కేసర్‌–ఎదులాబాద్‌ మెయిన్‌ రోడ్డు, ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌, బుగ్గానగర్‌ కాలనీ, బ్రూక్‌ బాండ్‌ కాలనీ, లింగాల కుంట పరిధిలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఘట్‌కేసర్‌ ఏఈ బలరాం తెలిపారు.

మేడ్చల్‌రూరల్‌లో..

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మైసమ్మగూడలో విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్‌ తెలిపారు.

శామీర్‌పేట్‌లో..

శామీర్‌పేట్‌: తూంకుంట మున్సిపాలిటీ బొమ్మరాశిపేట సబ్‌ స్టేషన్‌ పరిధిలో నేడు విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని శామీర్‌పేట ఏఈ రాఘవేందర్‌రావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. మరమ్మతుల కారణంగా సబ్‌ స్టేషన్‌ పరిధిలో బొమ్మరాశిపేట, జగ్గంగూడ రోడ్డు తదితర ప్రాంతాలకు ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

పోచారంలో..

పోచారం: పోచారంలోని 33/11 కేవీ సబ్‌ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున గురువారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నానగర్‌, డాక్టర్స్‌ కాలనీ, జోడిమెట్ల క్రాస్‌ రోడ్‌, అరుంధతి కాలనీ, హుడా కార్తికేయ, కాకతీయనగర్‌, స్వర్ణగిరి, వైష్ణవి కాలనీ, చౌదరిగూడ ప్రాంతాలకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు పోచారం, డాక్టర్స్‌ కాలనీ, విజయ్‌ సాయి ఎన్‌క్లేవ్‌ ప్రాంతాలకు కరెంట్‌ ఉండదని తెలిపారు.

రేపు రాష్ట్ర కార్యవర్గం అత్యవసర భేటీ

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (టీయూటీఎఫ్‌) రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశం ఈ నెల 15న (శుక్రవారం) పీర్జాదిగూడ (ఉప్పల్‌ డిపో వెనుక)లో విజయ రత్న హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్నట్లు టీయూటీఎఫ్‌ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జంకిటి కైలాసం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర కార్యవర్గ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా శాఖలు, కార్యవర్గ సభ్యులు హాజరై, భవిష్యత్‌ కార్యక్రమం నిర్వహణ కోసం తీర్మానాలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నియామకం



యాదగిరికి నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

శామీర్‌పేట్‌: శామీర్‌పేట మండల ఉద్యమకారుల ఫోరం శామీర్‌పేట మండల అధ్యక్షుడిగా తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన యాదగిరిని నియమిస్తూ బుధవారం నియామక పత్రాన్ని మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌ ఆదేశానుసారం తెలంగాణ ఉద్యమసమయంలో పోరాడిన ఉద్యమకారులను గుర్తించాలనే సదుద్దేశ్యంతో పదవులను కేటాయిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనంతలక్ష్మీ, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో ‘ఎల్‌వైఎఫ్‌’ పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ రిలీజ్‌ చేస్తున్న చిత్రబృందం, మల్లారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్‌ రామస్వామిరెడ్డి

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ టెక్నికల్‌ కళాశాలలో ఎల్‌వైఎఫ్‌–లవ్‌ యువర్‌ ఫాదర్‌ మూవీ పోస్టర్‌ ఆవిష్కరించారు. బుధవారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ లాంచ్‌ కార్యక్రమంలో నిర్మాతలు కిశోర్‌ రాఠీ, అన్నపురెడ్డి సామ్రాజ్యలక్ష్మి, సీఎంఆర్‌ గ్రూప్స్‌ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాల మెయిన్‌ క్యాంపస్‌ ప్రిన్సిపాల్‌ రామస్వామిరెడ్డి చిత్రబృందంతో కలిసి పోస్టర్‌ రిలీజ్‌ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. చలనచిత్ర నిర్మాణ సంస్థ మనీషా ఆర్ట్స్‌ మరియు అన్నపురెడ్డి స్టూడియోస్‌ ఆధ్వర్యంలో చిత్రీకరించిన ఈ చిత్రంలో మల్లారెడ్డి విద్యాసంస్థల పూర్వ విద్యార్థి శ్రీహర్ష హీరోగా నటిస్తుండగా ముంబైకి చెందిన కశిక కపూర్‌, మిస్‌ ఇండియా యూనివర్స్‌కు ఎంపికైన రియా సింగా హీరోయిన్లుగా నటిస్తున్నారని తెలిపారు. తండ్రీ–కొడుకుల మధ్య ఉన్న అనుబంధం ఇతివృత్తంగా తీసిన చిత్రమని, నటీనటుల పాత్రలను వివరించారు. ప్రస్తుతం పోస్ట్‌ ప్రొడక్షన్‌ దశలో ఉందన్నారు. హీరో శ్రీహర్ష మాట్లాడుతూ.. చిత్రానికి మణిశర్మ అద్భుతమైన సంగీతం అందించారని, అన్ని పాటలు ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ కుటుంబ సమేతంగా చూడాలని, తమ తొలి ప్రయత్నాన్ని ఆశీర్వదించి ప్రొత్సహించాలని కోరారు.

ప్రహరీని కూల్చివేసిన హైడ్రా అధికారులు





హైడ్రా అధికారులు కూల్చివేసిన ప్రహరీగోడ

కీసర: నాగారం మున్సిపాలిటీలో 40 ఫీట్ల (40 అడుగులు) రహదారిని కబ్జాచేసి నిర్మించిన ప్రహరీగోడను బుధవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్లితే.. నాగారం సర్వే నెంబర్‌లో 145,146 లేఅవుట్‌ పరిధిలోగల 40 అడుగుల రహదారిని నాగారంకు చెందిన ఓ వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాచేసి సదరు స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టారని రాజ్‌ సుఖ్‌నగర్‌, బాలజీనగర్‌, హనుమాన్‌నగర్‌, ఈస్ట్‌ హనుమాన్‌, సాయిస్వరూప్‌నగర్‌ కాలనీవాసుల తోపాటు, స్థానిక కాంగ్రెస్‌ నేతలు హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి–ఘట్‌కేసర్‌ ప్రధాన రహదారిలో కబ్జాకు గురైన 40 అడుగుల రహదారి ప్రాంతానికి చేరుకున్న హైడ్రా అధికారులు గట్టి బందోబస్తు మధ్య జేసీబీ సహాయంతో ప్రహరీగోడను పూర్తిగా కూల్చివేయించారు. అనంతరం అందులోఉన్న రేకులు, బెస్‌మెంట్‌ తదితర వాటిని కూడా పూర్తిగా తొలగించి 40 అడుగుల రహదారిని క్లీయర్‌ చేశారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌, నాగారం మున్సిపల్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్‌ పంబాల సరితారమేష్‌, స్థానిక నేతలు, కాలనీవాసులు 40 అడుగుల రహదారి ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం ఏళ్ల నుంచి ఉన్న రహదారి సమస్యను పరిష్కరించినందుకు హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌తోపాటు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్‌ పాలనలో పలుమార్లు అధికారులకు, పాలకులకు రోడ్డు సమస్యపై ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదన్నారు.

సర్వే సమయాన్ని కుటుంబ సభ్యులకు ముందే చెప్పాలి





సాక్షి,సిటీబ్యూరో: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే సమయాన్ని ముందుగానే కుటుంబాలకు తెలిపి, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునేలా సంబంధిత సర్వే నోడల్‌ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్‌ సూచించారు. బుధవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ వీసీహాల్‌లో కుటుంబ సర్వే, ధాన్యం సేకరణ అంశాలపై మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌తో కలిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి హోదాలో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా అందుబాటులో లేని కుటుంబ సభ్యులకు ముందుగానే సర్వే సమయాన్ని, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో పెట్టుకునేలా ఎన్యూమరేటర్ల వారికి సమాచారం ఇచ్చేలా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి దివ్యదేవరాజన్‌ ఆదేశించారు. ఎన్యూమరేటర్లు డాక్యుమెంట్లు చూసి తప్పులు జరుగకుండా ప్రొఫార్మాలను పూరించాలని, ఏదైన సందేహాలు ఉంటే సూపర్‌ వైజర్‌, నోడల్‌ అధికారి దృష్టికి తీసుకురావలని ఆమె పేర్కొన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్‌ రూపొందించుకుని సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున వారు స్వచ్ఛందంగా కోరిన చోట నమోదు చేయించాలన్నారు. ఎన్యూమరేటర్లు కుటుంబ సభ్యులతో సౌమ్యంగా మాట్లాడి సమాధానాలు తెలుసుకుంటూ, ప్రత్యక్షంగా పరిశీలించిన అంశాలను ప్రొఫార్మాలో పూరించాలన్నారు. సర్వే నిర్వహణలో కలిగే ఇబ్బందులపై నోడల్‌ అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. దీనికి ముందు జిల్లా నోడల్‌ అధికారులతో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎదురయ్యే ఇబ్బందులను, సమస్యలను నోడల్‌ అధికారులను అడిగి తెలుసుకోవటంతో పాటు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమాచారాన్ని ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్‌కు జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ వివరించారు. జిల్లాలో గ్రూప్‌–3 పరీక్షలు ఉన్నందున, సర్వే పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం అవసరమవుతుందని కలెక్టర్‌ తెలిపారు. సమావేశంలో మేడ్చల్‌ జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఓలు సైదులు, శ్యాం ప్రకాష్‌, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌ కుమార్‌, జిల్లా సంక్షేమ శాఖాధికారి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరా డీఎం సుగుణబాయి, జిల్లా యువజన శాఖాధికారి గోపాల్‌ రావు, జిల్లా మత్స్య శాఖాధికారి సుకీర్తి, ఎస్సీ కార్పొరేషన్‌ అధికారి బాబు మోసిస్‌, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇందిరామహిళా శక్తి అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా క్యాంటీన్‌ను పరిశీలించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్‌ క్యాంటీన్‌లో ఉన్న ఆహార పదార్థాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌ గౌతమ్‌తోసహా వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వీధి కుక్కల్ని కర్రలతో హతమార్చిన దుండగులు

- ఘటనలో రెండు కుక్కలు మృతి
- కేసు నమోదు



జవహర్‌నగర్‌: వీధి కుక్కలపై పలువురు దుండగులు కర్రలతో దాడి చేసి చిత్రహింసలకు గురిచేసి చంపిన దారుణ ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ కార్మికనగర్‌లో వీధి కుక్కలను కృష్ణ, ఉపేందర్‌, కృష్ణ, వెంకటేష్‌ అనే నలుగురు వ్యక్తులు బంధించి కర్రలతో కొట్టి చంపి వాటిని రోడ్డుపై పడేశారు. ఈ సంఘటనను స్థానికులు వీడియో తీసి, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా.. అందులో రెండు కుక్కలు అక్కడిక్కడే మృతిచెందగా, ఒక కుక్కని సఫీ ఎన్‌జీవో సహకారంతో చికిత్స అందిస్తున్నారు. సయ్యద్‌ సలీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుక్కలపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.